# వేములవాడలో ఘనంగా అంబేద్కర్ జయంతి



■ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది నివాళి

**ప్రజానావ, వేములవాడ :** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతిని వేములవాడ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజుతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ బాబా సాహెబ్ చూపిన మార్గంలో పయనించడం ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ పట్టణ కౌన్సిలర్లు, అంబేద్కర్ సంఘం నాయకులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రజలు మరియు వివిధ శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని జై భీమ్ నినాదాలతో నివాళులు అర్పించారు.

## సీపీఎం ఆధ్వర్యంలో..

అంబేద్కర్‌జయంతిని జిల్లా సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోడం రమణ, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, అన్నదాస్ గణేష్, సీపీఎం జిల్లా నాయకులు మిట్టపల్లి రాజమల్లు, సిరిమల్లె సత్యం, ఆడేపు రజిత, ఒగ్గు గణేష్, జిందం కమలాకర్, గడ్డం రాజశేఖర్, గీస బిక్షపతి, బింగి సంపత్, సందు పట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తిప్పాపూర్‌లో అంబేద్కర్‌విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని ప్రారంభించి, అంబేద్కర్ సేవలను కొనియాడారు. విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆయన సందేశాన్ని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల డిపోలో ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు

## సమ్మెకు సిద్ధమని కార్మికుల హెచ్చరిక

## డిపో ముందు నిరసన



**ప్రజానావ, సిరిసిల్ల :** తమ భవిష్యత్ కార్యాచరణ కోసం డిమాండ్ల సాధన కోసం జేఏసీగా ఏర్పడి ముందుకు వస్తున్నట్టు సిరిసిల్ల డిపో ఆర్టీసీ ఉద్యోగం ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ ఆర్టీసీ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మంగళవారం సిరిసిల్ల డిపో ఉద్యోగులు అత్యవసర సమావేశమై నూతన జేఏసీ కమిటీని ఏర్పాటు చేశారు.రాష్ట్ర జేఏసీ కమిటీ పిలుపు వచ్చిన ఏ క్షణమైనా సమ్మెకు సిద్ధంగా ఉన్నామని సిరిసిల్ల డిపో జేఏసీ పక్షాన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానం ప్రకారం ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని అలాగే యూనియన్లను పున:రుద్ధరించాలని ప్రధాన డిమాండ్లుగా వారు పేర్కొన్నారు. అలాగే 2021, 2025 వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టాలని లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వం యాజమాన్యం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సుమారు 50 మంది కార్మికులు పాల్గొన్నారు. సిరిసిల్ల డిపో జేఏసీ కమిటీలో చైర్మన్‌గా బాణయ్య (కండక్టర్), వైస్ చైర్మన్‌గా జెఎస్ఎన్ రావు (డ్రైవర్), వైస్ చైర్మన్‌గా బి. శ్రీనివాస్ (డ్రైవర్ )ను, కన్వీనర్ గా వి. రాజేందర్, ఎం. ముత్యం, అర్. రాంచంద్రం, ఎం. తిరుపతి, మహిళా కన్వీనర్లుగా వి. కవిత, బి. సునీత, కె. సుమలత ఎంపికయ్యారు. ఈ కమిటీని రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జిపి సింగ్, జిల్లా కమిటీ కార్యదర్శి పాపారావు, జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి రామ్ రెడ్డి నాయక్, ఎంపీ. కుమార్ ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సభ్యులుగా కె.నర్సింలు, బి.కేపతి , జి.మల్లేశం, రఘు, శేఖర్ రావు, లక్ష్మణ్, టీవీసి రావు, ప్రకాష్, సంతోష్ రవి, జావిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# 'సెస్' మనుగడపై నేడు హైకోర్టులో తేలనున్న విధి!

## 'సెస్' మనుగడపై నేడు హైకోర్టులో తేలనున్న విధి!

- 56 ఏళ్ల ఉజ్వల చరిత్ర కలిగిన విద్యుత్ సంస్థ అంతర్ధానం కానుందా?
- నేడు విచారణ చేపట్టనున్న ధర్మాసనం.. వినియోగదారుల్లో పెరిగిన ఉత్కంఠ
- వ్యూహాత్మకంగా అడుగులు వేసిన ప్రభుత్వం
- స్పందించని రాజకీయ పక్షాలు
- సహకార స్ఫూర్తిని కాపాడాలని సభ్యుల డిమాండ్.. న్యాయ పోరాటమే శరణ్యమా?




**ప్రజానావ, సిరిసిల్ల:** దేశంలోనే ఉత్తమ విద్యుత్ సేవా సంస్థగా పేరొందిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. 56 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ సంస్థ లైసెన్సు గడువు గత మార్చి 31తో ముగియడం, ప్రభుత్వం దానిని పునరుద్ధరించకపోవడంతో ఒక్కసారిగా పరిస్థితులు మారిపోయాయి. ప్రజలకు సేవలు నిలిచిపోకూడదనే కారణంతో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎన్పీడీసీఎల్ (టీజీఎన్పీడీసీఎల్) ఈ సంస్థను తమ ఆధీనంలోకి తీసుకుంది. ప్రభుత్వ చర్యను సవాల్ చేస్తూ సెస్ పాలకవర్గం రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో బుధవారం (ఏప్రిల్ 15) హైకోర్టులో జరగనున్న విచారణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రభుత్వం అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించి సెస్ లైసెన్సును రెన్యూవల్ చేయకపోవడం, వెనువెంటనే ఎన్పీడీసీఎల్ ద్వారా కార్యకలాపాలు ప్రారంభించడంతో వినియోగదారులు విస్మయానికి గురయ్యారు. ఎన్పీడీసీఎల్ సీఎండి వరుణ్ రెడ్డి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సేవలు వేగవంతం చేస్తుండటంతో, ప్రజల్లో సంస్థ మార్పుపై క్రమంగా భరోసా కల్పించే ప్రయత్నం జరుగుతోంది. గతంలో సంస్థపై ఉన్న అవినీతి ఆరోపణలు, నష్టాలు మరియు అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని ప్రభుత్వం విలీన ప్రక్రియను వేగవంతం చేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు సిరిసిల్ల ప్రాంతంలో రాజకీయ సమీకరణలు కూడా ప్రభుత్వ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు చర్చ జరుగుతోంది. సెస్ సంస్థలో సుమారు 3.47 లక్షల మంది సభ్యులు, రూ. 6.20 కోట్ల వాటాధనం ఉంది. ఈ సంస్థను ఎన్పీడీసీఎల్‌లో విలీనం చేయరాదని, సహకార వ్యవస్థను దెబ్బతీయవద్దని సభ్యులు, గ్రామ ప్రతినిధుల మహాజన సభ తీర్మానించింది. పాలకవర్గం పదవీకాలం ఇంకా 20 నెలలు ఉన్నందున, సంస్థను యథావిధిగా కొనసాగించాలని వారు కోరుతున్నారు. అవసరమైతే తాము రాజీనామా చేస్తామని, ప్రభుత్వం నామినేటెడ్ కమిటీ ద్వారా అయినా సంస్థను నడపాలని వారు ప్రతిపాదిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ చర్యలను సమర్థిస్తుండగా, బీఆర్ఎస్ మరియు ఇతర విపక్షాలు కోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. నేడు వెలువడనున్న హైకోర్టు నిర్ణయం సెస్ మనుగడను శాసిస్తుందా లేదా అనేది వేచి చూడాలి.

# త్రయంబకేశ్వరంలో 'తక్షణ' దోపిడీ!

■ అక్రమ దర్శనాల భారీ కుంభకోణంలో ఆలయ ట్రస్టీ అరెస్ట్

**ప్రజానావ, ముంబై:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రయంబకేశ్వర ఆలయంలో తక్షణ దర్శనం పేరుతో సాగుతున్న భారీ కుంభకోణాన్ని పోలీసులు ఛేదించారు. భక్తుల భక్తిని ఆసరాగా చేసుకుని కొందరు ముఠాగా ఏర్పడి, దర్శనం కోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఆలయ ట్రస్టీ పురుషోత్తం కడలగ్‌తో పాటు ఒక దళారీని పోలీసులు అరెస్ట్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా భక్తుల నుంచి భారీగా నగదు వసూలు చేస్తూ, సామాన్య భక్తులకు అన్యాయం చేస్తున్న ఈ ముఠా భాగోతం చూసి అధికారులు సైతం విస్మయానికి గురవుతున్నారు. ఆలయంలో అధికారికంగా ఎటువంటి 'పెయిడ్ దర్శనం' లేదా 'తక్షణ దర్శనం' సౌకర్యం లేకపోయినా, ఈ ముఠా భక్తుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ. 2 వేల నుండి రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తేలింది. నగదు చెల్లించిన వారికి కేవలం 10 నిమిషాల్లోనే దర్శనం కల్పిస్తూ నెలకు సుమారు రూ. 90 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని, క్యూ లైన్లతో సంబంధం లేకుండా రహస్య మార్గాల ద్వారా దర్శనానికి పంపుతున్నట్లు సమాచారం. ఆలయ భద్రతా వ్యవస్థ మరియు పర్యవేక్షణపై ఈ ఘటన తీవ్ర సందేహాలను రేకెత్తిస్తోంది. ట్రస్ట్ బోర్డులో కీలక సభ్యుడే ఈ అక్రమాలకు సూత్రధారిగా ఉండటం భక్తుల ఆగ్రహానికి కారణమవుతోంది. ఈ ముఠాలో ఇంకా ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయి? గత ఎంతకాలంగా ఈ దందా సాగుతోంది? అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పుణ్యక్షేత్రాల్లో ఇటువంటి అక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.



# బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కార్యకర్తలందరితో రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ అంబేద్కర్ గురువు జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా నేటి కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయం అంబేద్కర్ ఆశయాల సాధనలో ఒక ముఖ్యమైన అడుగని తెలిపారు. లింగ వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అంబేద్కర్ కు ఘనంగా నివాళులు అర్పించారు.

# గీతానగర్‌లో పోషణ పక్షం ర్యాలీ



**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల గీతానగర్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే విద్యా కార్యక్రమాలను తల్లులకు వివరించారు. చిన్నారులకు ఆటలు, పాటలు, కథలు, బొమ్మల ద్వారా ఎలా బోధన చేపడుతున్నామో ప్రాక్టికల్‌గా చూపించారు. పిల్లల సమగ్ర అభివృద్ధిలో అంగన్వాడీ పాత్ర ఎంత ముఖ్యమో తల్లులకు తెలియజేశారు. అలాగే పోషణ పక్షం కార్యక్రమంలో భాగంగా తల్లులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సైదా షఫీ, హెల్పర్, చిన్నారులు, వారి తల్లులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉత్సాహంగా, అవగాహన పెంపొందించే విధంగా జరిగింది.

# శాయంపేటలో అంబేద్కర్ జయంతి




**ప్రజానావ, జమ్మికుంట :** జమ్మికుంట మండలం శాయంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మడికొండ సురేందర్ రావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్, గ్రామ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. సర్పంచ్ మడికొండ సురేందర్ రావు మాట్లాడుతూ అంబేద్కర్ భారతదేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహానుభావుల్లో ఒకరని కొనియాడారు. సమాజంలో అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ఆయన చేసిన కృషి అపారమని, అణగారిన వర్గాల అభ్యున్నతికి చూపిన మార్గం నేటికీ ఆదర్శప్రాయమని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# సిరిసిల్ల విద్యుత్ శాఖ ఎస్ఈ గా టి. వేణుమాధవ్ బాధ్యతల స్వీకారం



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ)గా టి. వేణుమాధవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఈ పదవిలో కొనసాగుతున్న బి. బిక్షపతి ములుగు జిల్లా ఎస్ఈగా బదిలీ కావడంతో, వారి స్థానంలో వేణుమాధవ్ ని నియమించారు. వేణుమాధవ్ ప్రస్తుతం కార్పొరేట్ కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ ఉండగా, సిరిసిల్లకు బదిలీపై వచ్చారు. గతంలో జనగామ జిల్లాల్లో సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా సేవలందించారు. జిల్లాలో నాణ్యమైన విద్యుత్ సరఫరా, వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వేణుమాధవ్ గారు తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తానన్నారు.




## ఉద్యోగం పేరుతో మోసం

- నెలకు రూ.25 వేల జీతం హామీతో నిరుద్యోగులకు వల
- రైల్వే స్టేషన్లలో దొంగతనాలు చేయించిన ముఠా
- ఆర్పీఎఫ్ దాడిలో ముగ్గురు అరెస్ట్, దేశవ్యాప్తంగా కార్యకలాపాల బట్టబయలు

**ప్రజానావ, ముంబై:** రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) ముంబైలో రైల్వే స్టేషన్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఒక విచిత్ర ముఠాను ఛేదించింది. నిరుద్యోగ యువకులను లక్ష్యంగా చేసుకుని వారికి నెలకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు జీతం ఇస్తామని మోసం చేసి, వారితో దొంగతనాలు చేయించేవారని పోలీసులు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ముఠా ముందుగా ఉద్యోగం పేరుతో యువకులను సంప్రదించి, వారిని తమ వలలోకి దింపేది. అనంతరం రైల్వే స్టేషన్లలో ప్రయాణికులపై నిఘా పెట్టించి, అవకాశమొచ్చినప్పుడు దొంగతనాలు చేయించేవారు. ఈ విధంగా సేకరించిన నగదు, విలువైన వస్తువులను ముఠా సభ్యులు స్వాధీనం చేసుకునేవారు. ఈ కేసులో బీహార్‌కు చెందిన కైలాష్ దాస్, మిథిలేష్ షా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కిషన్ నిషాద్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రాథమిక విచారణలో ఈ ముఠా నాగ్‌పూర్, భిలాయ్, బిలాస్‌పూర్ వంటి ప్రాంతాల్లోని రైల్వే స్టేషన్లలో కూడా చురుగ్గా పనిచేసినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని, ముఠాకు సంబంధించి మరికొందరిని గుర్తించే పనిలో ఉన్నట్లు ఆర్పీఎఫ్ అధికారులు తెలిపారు.

## మ్యూజిక్ కచేరీలో విషాదం

- డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో ఇద్దరు ఎంబీఏ విద్యార్థులు మృతి
- గోరేగావ్ నెస్కో సెంటర్‌లో కలకలం
- నిర్వాహకులు సహా ఆరుగురు అరెస్ట్

**ప్రజానావ, ముంబై:** ముంబైలోని నెస్కో ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన లైవ్ మ్యూజిక్ కచేరీలో విషాదం చోటుచేసుకుంది. డ్రగ్స్ అధిక మోతాదులో తీసుకోవడంతో ఇద్దరు ఎంబీఏ విద్యార్థులు (ఒక యువతి, ఒక యువకుడు) మృతి చెందగా, మరో యువతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, కచేరీ సందర్భంగా కొందరు పాల్గొనేవారికి మాదకద్రవ్యాలు సరఫరా చేసినట్లు గుర్తించారు. డ్రగ్స్ వినియోగం కారణంగా ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించినప్పటికీ, ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో యువతి చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, నిర్వాహకులు సహా మొత్తం ఆరుగురిని అరెస్ట్ చేశారు. ప్రాథమిక విచారణలో కార్యక్రమంలో మాదకద్రవ్యాల పంపిణీ, మైనర్లకు మద్యం అందించడం వంటి నిబంధనల ఉల్లంఘనలు జరిగినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

## కారం పొడి చల్లి.. కొడవలితో నరికి

- నాసిక్‌లో దారుణ హత్య


**ప్రజానావ, ముంబై:** ముంబై సమీపంలోని నాసిక్ జిల్లాలో దారుణ హత్య కలకలం రేపింది. విల్హోల్ ప్రాంతంలో సూరజ్ సోలంకి (37)ని ఓ మహిళ తన సహచరుడితో కలిసి అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితురాలు 'నన్ను వాడుకున్నావు' అంటూ బాధితుడితో వాగ్వాదానికి దిగింది. అనంతరం ఆమె తన సహచరుడితో కలిసి ముందుగా సూరజ్ కళ్లలో కారం పొడి చల్లింది. అతడు తేరుకునేలోపే రాయితో తలను బలంగా కొట్టి కిందపడేశారు. ఆ తర్వాత కొడవలితో ఎనిమిది సార్లు నరికి హత్య చేశారు. ఘటన అనంతరం ఇద్దరు నిందితులు బైక్‌పై అక్కడి నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. ప్రాథమిక విచారణలో ఈ హత్యకు అనైతిక సంబంధం కారణంగా వివాదం దారితీసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

## అమరావతిలో దారుణం

- 180 మందికి పైగా మైనర్ బాలికల అశ్లీల వీడియోలు
- యువకుడు అరెస్ట్.. పోక్సో, ఐటీ చట్టాల కింద కేసు

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. మైనర్ బాలికలను మోసం చేసి, వారి అశ్లీల ఫొటోలు, వీడియోలను సేకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేసిన కేసులో అయాన్ అహ్మద్ (19) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో 180 మందికి పైగా బాలికల వీడియోలు బయటకు వచ్చినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. పోలీసుల సమాచారం ప్రకారం.. నిందితుడు సోషల్ మీడియా వేదికల ద్వారా బాలికలతో పరిచయం పెంచుకొని, నమ్మకం కల్పించి, ఆ తర్వాత వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను పొందేవాడు. అనంతరం వాటిని అశ్లీలంగా మార్చి సోషల్ మీడియాలో పంచుతూ బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ కేసులో పోక్సోతో పాటు ఐటీ చట్టాల కింద కేసులు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మరి కొంతమంది బాధితులు ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల గోప్యతకు ప్రాధాన్యమిస్తూ, ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు.

ఈ సంఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు.





# రేవంత్ రెడ్డి యాంటీ అంబేద్కర్

### తెలంగాణ అంబేద్కర్ భిక్షే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3తోనే తెలంగాణ సాధ్యమైంది

- ప్రత్యేక రాష్ట్రం వచ్చి 12ఏళ్లు గడిచినా ఎలాంటి పురోగతి లేదు
- అంబేద్కర్ సాధారణ వ్యక్తి కాదు.. ఒక ఐడియాలజీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాంటీ అంబేద్కర్ అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఈ భూమిపై అంబేద్కర్ వ్యతిరేకి ఎవరైనా ఉంటే అది రేవంత్ రెడ్డే అని విమర్శించారు. ది యునైటెడ్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి 12గంటలకు ట్యాంక్ బండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని కవిత నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాబా సాహెబ్ జయంతి సందర్భంగానైనా ముఖ్యమంత్రికి బుద్ధి వచ్చి పేదలకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు.

అంబేద్కర్ అంటే ఒక వ్యక్తి మాత్రమే కాదు, ఒక ఐడియాలజీ, ఒక ఆలోచన అని పేర్కొన్నారు. మహిళల అభివృద్ధి ద్వారానే సమాజం అభివృద్ధి సాధ్యమని భావించిన అంబేద్కర్ మహిళల కోసం ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.

**తెలంగాణ రాష్ట్రం అంబేద్కర్ భిక్ష**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి బాబా సాహెబ్ అంబేద్కర్ కారణమని కవిత పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 లేకపోతే తెలంగాణ రాష్ట్రం సాధ్యమయ్యేది కాదన్నారు. సోషలిజం వర్ధిల్లాలని అంబేద్కర్ ఆశించారని, కానీ తెలంగాణలో ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చి 12ఏళ్లు గడిచినా దళితులు, మహిళలపై ఆకృత్యాలు తగ్గకపోవడం ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న ప్రాజెక్టుల కోసం దళితులకు చెందిన అసైన్డ్ భూములను ప్రభుత్వాలు స్వాధీనం చేసుకుంటున్నాయని ఆరోపించారు. వెలుగుమట్లలో అదే జరిగిందని, ప్రస్తుతం పరిగిలో సుమారు 1200 ఎకరాలు సేకరిస్తే అందులో ఎక్కువ భాగం అసైన్డ్ భూములేనని తెలిపారు. అంబేద్కర్ ఇచ్చిన ధైర్యంతో పేదలపక్షాన ఈ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నల్లమల అడవుల్లోని సహజ సంపదను దోచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచు గిరిజనులను బలవంతంగా తరలించే ప్రయత్నం చేస్తున్నాయని కవిత ఆరోపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం కడిచింతలపైలు, సార్లపల్లి చెంచు పెంటల్లో 200కు పైగా కుటుంబాలను పునరావాసం పేరుతో పంపించేందుకు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. అడవి వదిలి వెళ్లబోమని చెంచులు చెబుతున్నప్పటికీ వారిని తరలించే ప్రయత్నాలు సరికావని విమర్శించారు.

స్థానికంగానే గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు నల్లమల నుంచి పంపించాలనుకుంటున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అడవి బిడ్డలకు వారి స్వస్థలంలోనే జీవించే హక్కు కల్పించాలని, లేదంటే జాగృతి తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో మరిన్ని ఉద్యమాలు రావాలని, ప్రజల సమస్యలు పరిష్కారమవాలని కవిత ఆకాంక్షించారు.





## అజ్మీర్ దర్గాకు కవిత చాదర్ సమర్పణ

- జాగృతి కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భావం నేపథ్యంలో నిర్ణయం
- బంజారాహిల్స్ కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు
- మైనార్టీ నాయకుల ద్వారా అజ్మీర్‌కు పంపిన జాగృతి అధ్యక్షురాలు

**ప్రజానావ, హైదరాబాద్:** రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చాదర్ పంపించారు. జాగృతి కొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవించబోతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చాదర్‌ను మైనార్టీ నాయకులకు ఆమె అందజేశారు. ఈ చాదర్‌ను వారు అజ్మీర్‌కు తీసుకెళ్లి సమర్పించనున్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అజ్మీర్ షరీఫ్‌లోని ఖ్వాజా గరీబ్ నవాజ్ దర్గాను దర్శించుకుని మొక్కు చెల్లించుకుంటానని అప్పట్లో ప్రతిజ్ఞ చేసినట్లు చెప్పారు. తెలంగాణ ప్రజల పోరాట పటిమతో పాటు ఖ్వాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులతో రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం అజ్మీర్ దర్గాను సందర్శించి మొక్కు చెల్లించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో జాగృతి కొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవించబోతున్న నేపథ్యంలో ఆశీస్సులు పొందడానికి ఈసారి చాదర్ పంపిస్తున్నామని చెప్పారు. జాగృతి మైనార్టీ నాయకులు అజ్మీర్‌కు వెళ్లి చాదర్‌ను సమర్పిస్తారని వెల్లడించారు.

ఖ్వాజా గరీబ్ నవాజ్ ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్లు కవిత తెలిపారు.

## అంబేద్కర్ మార్గాన్ని అనుసరించాలి

- ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి
- ఫిలింనగర్‌లో ఘనంగా అంబేద్కర్ జయంతి



**ప్రజానావ, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్‌లో మహనీయుల విగ్రహాల వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా, సమాజంలోని అట్టడుగు వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహానుభావుడని తెలిపారు. సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధి కోసం ఆయన చూపిన మార్గం నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమర్నాథ్ సారంగుల, గడ్డం వెంకట్ స్వామి, వీణ రెడ్డి, ముద్దంగుల శ్రీనివాస్, గణేష్ యాదవ్, దండుగుల శేఖర్, దొంగరి రాజకళ, గుంటి ఆనంద్ సాగర్, వలిశెట్టి రాంబాబు, గురు బ్రహ్మ గౌడ్, బొట్టు కళ్యాణి, బోయ రామాంజనేయులు, వుట్ల శశిశేఖర్, గోర్క లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, తలారి బాలేశ్వర్, జి. రమ్య, పారిజాతం, మంజల నరసింహ, హరీష్ ముదిరాజు, రాము యాదవ్, ఎం. రాజు, మంతినేని రాంబాబు, శ్రీకాంత్, వరికుప్పల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



డా.బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా జీజేఎస్ నగర్ కమిటీ పిలుపు మేరకు ఫిలింనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్. ఈ కార్యక్రమంలో మామిడి నర్సింగ్ రావుతో పాటు వివిధ బస్తీల నాయకులు పాల్గొన్నారు.

– ప్రజానావ, ఖైరతాబాద్

